సాక్షి అనంతపురం

గురువారం । 16 । జనవరి । 2025



పాతుకుపోయారు..!

జిల్లాకేంద్రంలో కొందరు డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ) తిష్టవేశారు. కొందరు ఏకంగా 20 ఏళ్ల నుంచి ఉన్నారు. 8లో



టమాట కిలో రూ.9

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

33.9°/ 18.6°

జిల్లా అంతటా బుధవారంఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తెల్లవారుజామున చలితీవ్రత అధికంగానే ఉంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జస్టిస్ గుణరంజన్‌కు ఘన స్వాగతం



హైకోర్టు అదనపు జడ్జి గుణరంజన్‌కు స్వాగతం పలుకుతున్న రాకెట్లవాసులు

ఉరవకొండ: ఏపీ హైకోర్టు అదనపు జడ్జి జస్టిస్ గుణరంజన్‌కు ఘన స్వాగతం లభించింది. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, గ్రామ సర్పంచ్ దెయ్యాల నాగరాజుతో పాటు ప్రజలు జడ్జికి స్వాగతం పలికారు.

జిల్లా హాకీ జట్టు ఎంపిక

అనంతపురం: నగరంలో బుధవారం జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు హాకీ జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

జిల్లా జట్టు క్రీడాకారులు వీరే..

ప్రదీప్, ఆంజనేయులు, జి. వరుణ్, జశ్వంత్, నూర్ మహమ్మద్, అక్షయ్ కుమార్, యు.కార్తీక్, గేయానంద రెడ్డి, ఏ. వరుణ్, నందకిశోర్, గోవర్ధన్, అఖీరా, ఏ. పవన్, కే. ఉదయ్, బాబా ఫరీద్, వెంకటేశ్, పవన్ కుమార్, జునైద్.

స్టాండ్ బై: ఎన్ ఆర్ దీపక్, ధనుష్ కుమార్, మోహిత్.

దాడి చేసిన కానిస్టేబుల్ వీఆర్‌కు..

సాక్షి ఎఫెక్ట్..


అనంతపురం: యువకుడిపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపారు. నగరంలో మూడు రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంతియాజ్ అహమ్మద్‌పై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నారాయణస్వామి భౌతికదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో 'ఖాకీల కర్కశం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు.. మేయర్ వసీం సలీం ఆధ్వర్యంలో అనంతపురం డీఎస్పీని కలిసి దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎస్పీ జగదీష్.. ఘటనపై విచారించాలని అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రాథమిక విచారణ అనంతరం కానిస్టేబుల్ నారాయణ స్వామిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు.

గంజాయి బ్యాచ్ వీరంగం



బాధితుడు బేల్దారి నాగేంద్ర

తాడిపత్రిటౌన్: గంజాయి బ్యాచ్ మళ్లీ వీరంగం సృష్టించింది. మత్తులో బేల్దారిపై కత్తితో దాడి చేసి గాయపరిచింది. పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన బేల్దారి నాగేంద్ర బుధవారం సాయంత్రం తన ఇంటి సమీపంలోని టీ స్టాల్ వద్ద టీ తాగుతున్నాడు. ఈ క్రమంలోనే గంజాయి సేవించి అక్కడికి చేరుకున్న పట్టణానికి చెందిన యూనస్, యోసెన్, దీపక్ అలియాస్ దూపర్‌లు కత్తితో నాగేంద్రపై దాడి చేసి పరారయ్యారు. గాయపడిన నాగేంద్రను స్థానికులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సీసీ ఫుటేజీ సాయంతో నిందితులను గుర్తించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.



అశ్వ వాహనంపై నారసింహుడు



ఖాద్రీశుడి పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

పార్వేట ఉత్సవం.. ఖాద్రీశుడి వైభవం

నారసింహుడి నామస్మరణతో కదిరి పట్టణం మార్మోగింది. స్వామివారి పార్వేట ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పార్వేట మండప పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఉత్సవంలో భాగంగా వదిలే కుందేళ్లను పట్టుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

- కనుల పండువగా ఖాద్రీశుడి పార్వేట ఉత్సవం
- కుందేలును పట్టుకోవడానికి ఎగబడిన భక్తజనం
- తిరువీధుల్లో అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి పార్వేట ఉత్సవం భక్తుల కోలాహలం మధ్య బుధవారం కనుల పండువగా జరిగింది. ఏటా మకర సంక్రాంతి మరుసటి దినం కనుమ పండుగ నాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఖాద్రీశుడు ఆయుధం ధరించి వన విహారార్థం వెళ్లేవారని.. దుష్ట మృగాలను వేటాడి విజయ గర్వంతో తిరిగి వస్తారని.. అందుకే పార్వేట ఉత్సవాన్ని నిర్వహిస్తారని భక్తుల నమ్మకం.

కోలాహలంగా పార్వేట..

పాలపొంగుల ఉత్సవం ముగిసిన తర్వాత స్వామివారు సాయం సంధ్యావేళలో రైల్వేస్టేషన్ సమీపంలోని పార్వేట మండపం వద్దకు చేరుకున్నారు. తర్వాత రైలు కట్ట వద్ద ఎప్పటి లాగానే ఆచారం ప్రకారం కుందేలును జనం మధ్యకు వదిలారు. ఇలా ఒకటి తర్వాత మరొకటి చొప్పున జనం మధ్యకు నాలుగైదు కుందేళ్లను వదిలారు. ఆ సమయంలో కాసేపు భక్తుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. పార్వేట ఉత్సవంలో ఒకప్పుడు కుందేలు స్థానంలో పులిని వదిలేవారని భక్తులు తెలిపారు. భక్తులకు హాని కల్గిస్తుందని కొన్నేళ్లుగా కుందేలును వదులుతున్నట్లు పేర్కొన్నారు. పార్వేట పూర్తి కాగానే స్వామివారు రాయచోటి రోడ్డులో ఉన్న శమీ మండపం వద్దకు చేరుకొని అక్కడ పూజలు అందుకున్నారు.



కుందేళ్లతో యువకులు

ఆలయంలో ప్రత్యేక పూజలు..

నృసింహుని ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారికి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు స్తోత్రాద్రి (కదిరి కొండ) వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన తర్వాత ఆలయ అర్చకులు పార్వేట విశిష్టతను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కదిరి కొండ వద్ద స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. తర్వాత ఆయన స్వామివారి పల్లకీ మోశారు.

పాల పొంగుల ఉత్సవం..

కదిరి కొండ వద్ద పూజల అనంతరం శ్రీవారు కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న పాలు ఆరగింపు మంటపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆచారం ప్రకారం యాదవులు స్వామివారికి పాల పొంగులు నిర్వహించారు. నారసింహుడు పాలు ఆరగించిన అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు.

అశ్వవాహనంపై శ్రీవారు..

శమీ మండపం వద్ద పూజల అనంతరం శ్రీవారు విశేషాలంకరణతో అశ్వవాహనంపై పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద చోరసంవాదం నిర్వహించిన మీదట స్వామివారు తిరిగి ఆలయంలోకి ప్రవేశించడంతో పార్వేట ఉత్సవం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్వేట ఉత్సవంలో లక్ష్మీనారసింహుని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు కుల మతాలకతీతంగా పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.



పాలను పొంగిస్తున్న భక్తులు

హమ్మయ్య...ఇన్‌చార్జ్ పాలనకు స్వస్తి

- ఎట్టకేలకు 'సమగ్ర శిక్ష'కు రెగ్యులర్ ఏపీసీ
- డ్వామా ఏపీడీ శైలజ ఏపీసీగా నియామకం
- నేడు బాధ్యతల స్వీకరణ
- సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకాన్ని పట్టించుకోని ప్రభుత్వం



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో ఏడు నెలల ఇన్‌చార్జ్ పాలనకు ఎట్టకేలకు స్వస్తి పలికారు. డ్వామా ఏపీడీగా పని చేస్తున్న శైలజను అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు రెండురోజుల క్రితం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో సమగ్రశిక్షకు రెగ్యులర్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ)తో పాటు సెక్టోరియల్ అధికారులు లేక పథకాల పర్యవేక్షణ పూర్తిగా కుంటుపడింది. అత్యంత ప్రాధాన్యత కల్గిన విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలు జిల్లాలో అంతంత మాత్రంగానే జరుగుతోంది. 2024 మే 31న ఏపీసీ వరప్రసాదరావు రిటైర్డ్ అయ్యారు. తర్వాత కొద్దిరోజులు ఐఏఎస్ అధికారి నిదియాదేవి ఇన్‌చార్జ్ తీసుకున్నారు. తర్వాత నాగరాజు, ఆ తర్వాత ప్రస్తుత డీఈఓ ప్రసాద్‌బాబు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఎట్టకేలకు రెగ్యులర్ ఏపీసీని నియమించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శైలజ గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.

సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకాన్ని పట్టించుకోని ప్రభుత్వం..

విద్యాభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో కీలకంగా ఉండే సెక్టోరియల్ అధికారుల నియామకాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా దాదాపు ఐదు నెలల కిందట అప్పటి డీఈఓ (సమగ్రశిక్ష డీపీసీ) వరలక్ష్మి కక్షకట్టి ఉన్నవారందరినీ రీప్యాట్రియేషన్ చేశారు. తర్వాత ఆఘమేఘాలపై కొత్తవారి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ తర్వాత దరఖాస్తులు పరిశీలించి ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. అయితే నేటికీ భర్తీని పట్టించుకోలేదు. ఎప్పుడూ లేనివిధంగా మితిమీరిన రాజకీయ జోక్యంతో ఉన్నతాధికారులు కూడా గట్టి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులు, విద్యాభివృద్ధి కార్యక్రమాలు సమగ్రశిక్ష ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. సెక్టోరియల్ ఆఫీసర్ల ద్వారానే ఈ కార్యక్రమాలన్నీ జరుగుతుంటాయి. అధికార పార్టీకి చెందిన ఒక జూనియర్ ప్రజాప్రతినిధి తాను చెప్పిన వారికి సెక్టోరియల్ ఆఫీసర్‌గా అవకాశం ఇవ్వడం లేదనే కారణంగా సంబంధిత అధికారులపై తీవ్రస్థాయిలో బెదిరింపులతో కూడిన ఒత్తిళ్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికితోడు మరో సీనియర్ ప్రజాప్రతినిధి కూడా ఓ మహిళ ఉపాధ్యాయురాలిని సెక్టోరియల్ ఆఫీసర్‌గా తీసుకోవాలని సిఫార్సు చేశారు. తుది జాబితాలో ఆమె పేరు లేదని తెలుసుకున్న ఆయన.. అధికారులపై తీవ్రంగా ఆగ్రహం చేసినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగానే సెక్టోరియల్ ఆఫీసర్ల ఎంపిక మరుగున పడినట్లు తెలుస్తోంది.

ఆదాయం.. అందనంత దూరం!

- ఉమ్మడి జిల్లాలో దారుణంగా పరిస్థితి
- కోలుకోని స్థిరాస్తి రంగం
- అధ్వానంగా జీఎస్టీ వసూళ్లు
- భారీగా పడిపోయిన 'ఆటోమొబైల్' అమ్మకాలు
- ఇతర రంగాల ఆదాయం కూడా 52 శాతం తగ్గుదల
- 'కియా' నుంచి నామమాత్రపు ఆదాయంతో సరి!



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలకూ ప్రోత్సాహం లభించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే స్థిరాస్తి రంగానికి ఊపు వచ్చి ఆదాయ వనరులన్నీ బాగుండేవి. జీఎస్టీ వసూళ్లు ఊహించిన దానికంటే మించి ఉండటంతో ఎక్కడా ఇబ్బంది లేకుండా పోయింది. అయితే, గత ఏడు నెలలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి తిరగబడింది. ఆదాయ వనరులన్నీ మూసుకుపోయాయి. కనీస లక్ష్యాలు కూడా అందుకోవడం కష్టమైంది. దీంతో అధికార యంత్రాంగానికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

పడిపోయిన జీఎస్టీ వసూళ్లు..

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆదాయ వనరు జీఎస్టీ (గూడ్స్‌అండ్ సర్వీసెస్ ట్యాక్స్)నే. 2019–23 మధ్యకాలంలో సగటున నెలకు జీఎస్టీ వసూళ్లు రూ.550 కోట్లు ఉండేవి. ఇప్పుడు రూ.300 కోట్లు కూడా రావడం లేదు. చివరకు పన్నులు వసూళ్ల కాక మూడు వందల మందికి పైగా నోటీసులు ఇచ్చారు. మరోవైపు వ్యాపారాలు లేవని, పన్నులు కట్టే పరిస్థితి లేదని వ్యాపారులు వాపోతున్నారు.

'స్థిరాస్తి' కుదేలు

ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి రంగం కుదైలేంది. ఒకప్పుడు కళకళలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నేడు బోసిపోతున్నాయి. రోజుకు నాలుగైదు డాక్యుమెంట్లు వచ్చినా చాలురా దేవుడా అనే పరిస్థితి వచ్చింది. అనంతపురం జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.469 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకూ కేవలం రూ.142 కోట్లు వచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.248 కోట్ల లక్ష్యానికి గాను కేవలం రూ.85 కోట్లు వసూలైంది.

'కియా' నుంచి అంతంతే..

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 'కియా' కార్ల కంపెనీ నుంచి పన్నుల రూపంలో వస్తున్న మొత్తం చాలా తక్కువగా ఉంటోందని జీఎస్టీ నిపుణులు చెబుతున్నారు. ప్రతి వంద కార్ల ఉత్పత్తిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతున్నది కేవలం 2 కార్లే అని, మిగతా కార్లు ఎగుమతి అవుతుండటంతో స్టేట్ జీఎస్టీ పరిధిలోకి రాదని చెబుతున్నారు. దీంతో ఆదాయం చాలా తక్కువగా ఉందంటున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఆదాయం ఇలా

కేటగిరీ	వసూళ్లు
జీఎస్టీ	రూ.300 కోట్లు
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్	రూ.142 కోట్లు
ఆటోమొబైల్ రంగం తగ్గుదల	40 శాతం పైనే
కియా సేల్స్‌లో ఏపీకి వచ్చే పన్ను	2 శాతం
ఇతర రంగాల ఆదాయం తగ్గుదల	52 శాతం



ఆటోమొబైల్ రంగం కుదేలు..

గతంలో ఎప్పుడూ లేనంతగా ఆటోమొబైల్ రంగం పడిపోయినట్టు వాహన డీలర్లు చెబుతున్నారు. 2023–24తో పోలిస్తే 40 శాతం అమ్మకాలు కూడా జరగలేదని వాపోతున్నారు. కార్ల కొనుగోళ్లు భారీగా తగ్గాయి. ఎప్పుడూ ద్విచక్ర వాహనాల కొనుగోళ్లతో రద్దీగా ఉండే మార్కెట్ ఈ సారి కళ తప్పింది. గతంలో ఆటోమొబైల్ రంగం నుంచి భారీగా రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తుండేది. అలాంటిది ఇప్పుడు డీలా పడినట్టు తెలుస్తోంది. దీంతో పాటు డీజిల్, పెట్రోల్ నుంచి కూడా అనుకున్న మేర సేల్స్ ట్యాక్స్ రావడం లేదని తేలింది.

వ్యాపారం పడిపోయింది



గత ఏడాదితో పోల్చితే రిజిస్ట్రేషన్లు బాగా తగ్గాయి. బిజినెస్ పూర్తిగా పడిపోయింది. ఎవరిని అడిగినా డబ్బులు మార్కెట్లో ఫ్లో లేదని చెబుతున్నారు. గతంలో రోజుకు రెండుమూడు డాక్యుమెంట్లు చేసేవాణ్ణి. ఇప్పుడు వారానికి ఒకటి కూడా లేదు. పరిస్థితి చాలా దారుణంగా ఉంది. కొంతమంది శూన్య మాసంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం లేదని చెబుతున్నారు.

– నాగార్జున రెడ్డి, డాక్యుమెంట్ రైటర్, అనంతపురం

'స్థిరాస్తి' మందగమనం



జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం మందగించింది. భూముల రేట్లు, మార్కెట్ విలువ విపరీతంగా పెరగడంతో రియల్టర్లు వెంచర్లు వేయడానికి వెనకడుగు వేస్తున్నారు. గతంలో ఏడాదికి రెండు వెంచర్లు వేసేవాళ్లం. ప్రస్తుతం వ్యాపారాలు లేకపోవడంతో వెంచర్లు వేసే ఆలోచనవిరమించుకున్నాం.

– ఉజ్జినప్ప, స్థిరాస్తి వ్యాపారస్తుడు, అనంతపురం

చౌడేశ్వరీ పాహిమాం...

కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



ఉరవకొండలో పెద్ద చౌడేశ్వరీ ఆలయ జ్యోతుల ఉత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. తొగట వీర క్షత్రియ మహిళలు పవిత్ర గంగజలాన్ని భారీ ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అమ్మవారిని అభిషేకించారు.

వివరాలు 8లో

క్లుప్తంగా

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న పందెం కోళ్లు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం పరిసరాల్లో కోడి పందెం ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. అందిన పక్కా సమాచారంతో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గూళ్లపాళ్యం సమీపంలో కోడి పందెం ఆడుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి మూడు పందెం కోళ్లు, రెండు కత్తులు, రూ.1,4750 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని ఎ.తిమ్మాపురం సమీపంలో బుధవారం పేకాట ఆడుతూ పలువురు పోలీసులకు పట్టుపడ్డారు. అందిన పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని రూ.42,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో చోరీలు

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ హోటల్ పక్కన ఉన్న బంకుతో పాటు ఆ పక్కనే ఉన్న మరో హోటల్‌లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించారు. వివరాలు... సతీష్‌కు చెందిన బంక్ తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ.3 వేల నగదుతో పాటు రూ.3 వేల విలువైన సిగరెట్లు అపహరించారు. రామాంజనేయులుకు చెందిన హోటల్‌లో రూ.3 వేల నగదుతో పాటు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బస్సును ఢీకొన్న కారు

గార్లదిన్నె: ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటన గార్లదిన్నె మండలంలో చోటు చేసుకుంది. వివరాలు... బుధవారం అనంతపురం నుంచి గుంతకల్లుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు... గార్లదిన్నెలో పెనకచెర్ల డ్యాం క్రాస్ వద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగింది. అదే సమయంలో బస్సు వెనకనే వచ్చిన కారు నుంచి ముకుందాపురానికి చెందిన వ్యక్తి దిగి పెనకచెర్ల డ్యాం క్రాస్ వైపుగా వెళుతుండగా ఉన్నఫళంగా కారు ముందుకు దూకి ఎదురుగా ఉన్న బస్సును ఢీకొంది. ఘటనలో కారు ఢోరు ధ్వంసమైంది. ఘటనలో ఎవరూ గాయపడలేదు. కాగా, కారు డ్రైవర్ అజాగ్రత్తనే ప్రమాదానికి కారణంగా తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో గాయపడిన వారు

పెనుకొండ: మంత్రి సవిత పుట్టినరోజు వేడుకలకు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపి స్వగ్రామానికి తిరిగి వెళ్తూ ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు చనిపోగా మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. వివరాల్లోకెళితే.. రొద్దం మండలం ఎం. కొత్తపల్లికి చెందిన బోయ సంజీవప్ప, బోయ వీరన్న టీడీపీ కార్యకర్తలు. బుధవారం మంత్రి సవిత పుట్టినరోజు కావడంతో శుభాకాంక్షలు తెలపడానికి పెనుకొండకు వచ్చారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే పెనుకొండ రైల్వేగేటు దాటిన తర్వాత మైక్రోస్టేషన్ వద్ద ఘాట్ రోడ్డులో వాహనం అదుపుతప్పింది. తీవ్ర గాయాలైన బోయ సంజీవప్పను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన బోయ వీరన్నను బెంగళూరుకు తరలించారు.





విశేష అలంకరణలో దర్శనమిస్తున్న పెద్దచౌడేశ్వరీ అమ్మవారి మూలవిరాట్, జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

చౌడేశ్వరీ పాహిమాం...

ఉరవకొండ: స్థానిక 4వ వార్డులో వెలసిన పెద్ద చౌడేశ్వరీ ఆలయ జ్యోతుల ఉత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఈ నెల 14న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేకువజామున అమ్మవారికి ప్రీతికరమైన ఖడ్గ పద్యాలతో స్తుతిస్తూ, మేళా తాళలతో ఊరేగుతూ జ్యోతుల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి సంక్రాంతి రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 104 కలశాలలో తొగట వీర క్షత్రియ మహిళలు పవిత్ర గంగజలాన్ని భారీ ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అమ్మవారిని అభిషేకించారు. బుధవారం వేకువజామున కులగురువు దివ్యజ్ఞానానంద గిరి స్వామి ఆధ్వర్యంలో చౌడేశ్వరీ కాలనీ నుంచి జ్యోతులను తల మీద పెట్టుకుని నృత్యాలు చేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో స్థానికులు, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

పాతుకుపోయారు!

- జిల్లా కేంద్రాన్ని వీడని డీటీలు
- 15 ఏళ్లుగా వివిధ శాఖలకు చక్కర్లు

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో రెవెన్యూ శాఖది ప్రత్యేక స్థానం. పరిపాలనా వ్యవహారాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న రెవెన్యూ శాఖలో నియమితులైన డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల సేవలు చాలా కీలకంగా ఉంటాయి. అయితే ఇతర శాఖల్లో మాదిరి రెవెన్యూ శాఖలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు నిబంధన అమలు కావడం లేదు. ప్రధానంగా ఉద్యోగుల బదిలీలు, ఇందులోనూ డిప్యూటీ తహసీల్దార్ల విషయంలో ఇది తేటతెల్లమవుతోంది. కేఆర్‌ఆర్‌సీ, ఆర్‌డీఓ, అర్బన్, రూరల్ తహసీల్దారు, భూ సంస్కరణలు, జిల్లా సరఫరాల శాఖ, పీఏబీఆర్, హెచ్‌ఎన్ఎస్ఎస్, హెచ్చెల్సీ, డ్వామా, అహుడా, ట్రాన్స్‌కో... ఇలా వివిధ శాఖల్లో డిప్యూటీ తహసీల్దార్లు సేవలు అందిస్తున్నారు. ఒక డిప్యూటీ తహసీల్దారు ఆయా శాఖల్లో ఐదేళ్లు పనిచేసినా... ఒకే స్టేషన్ (కేంద్రం)లో ఐదేళ్లు సర్వీసు పూర్తయినా మరో స్టేషన్‌కు బదిలీ చేయాలనే నిబంధన స్పష్టంగా ఉంది. అయితే ఈ నిబంధన రెవెన్యూ శాఖలో అమలు కావడం లేదు. ఎన్ని దఫాలు బదిలీ (స్థాన చలనాలు) జరిగిన పలువురు డిప్యూటీ తహసీల్దారులు జిల్లా కేంద్రం వీడడం లేదు. బదలీల పేరుతో కలెక్టరేట్ లేదంటే ఇతర కార్యాలయాలకు చక్కర్లు కొడుతున్నారే తప్ప జిల్లా కేంద్రం వీడడం లేదు. ఇలా దాదాపు 12 మంది డిప్యూటీ తహసీల్దార్లు జిల్లా కేంద్రంలోనే తిష్ట వేశారని రెవెన్యూ వర్గాలే చెబుతుండడం గమనార్హం. కొందరైతే ఏకంగా 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు జిల్లా కేంద్రంలోనే వివిధ శాఖలకు స్థాన చలనం పొందుతున్నట్లు సమాచారం. అయితే అందరి విషయంలోనూ ఇలాగే ఉంటుందనుకుంటే పొరపాటే. రెవెన్యూశాఖలో 'మేనేజ్' చేసుకోవడం చేతనైన వారు మాత్రమే జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. అలా మేనేజ్ చేసుకోవడం రానివారు జిల్లా కేంద్రం వీడాల్సి వస్తోంది. ఇదంతా గమనించిన మిగిలిన సిబ్బంది ఇదే ఇక్కడి 'రూల్' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్ కార్యాలయం

పెరిగిన టెంకాయల విక్రయ ఆదాయం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారున 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన బాటసుంకులమ్మ ఆలయంలో టెంకాలయ విక్రయానికి మంగళవారం వేలం నిర్వహించారు. వేలం దక్కించుకున్న వచ్చే ఏడాది సంక్రాంతి వరకూ ఆలయం వద్ద టెంకాయలను విక్రయించుకునే హక్కును పొందుతారు. ఈ క్రమంలో మొత్తం 12 మంది టెండర్‌దారులు రూ.500 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య రూ.35.60 లక్షలతో కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. గ తేడాది రూ.28 లక్షలకు పలికిన వేలం పాట ఈ ఏడాది రూ.35.60 లక్షలకు ఖరారు కావడంతో రూ.7.60 లక్షల అదనపు ఆదాయం సమకూరినట్టైంది. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కర్లకుంట రమేష్‌బాబు, అంబటి నరసింహులు, వెంకట్రాముడు పాల్గొన్నారు.



టెంకాయల వేలం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

గంగమ్మకు.. సూర్యాభిషేకం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లి కూడలిలో వెలసిన గంగమ్మ తల్లి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. మకర సంక్రాంతి రోజైన మంగళవారం అమ్మవారి పాదాలను సూర్యకిరణాలు తాకడంతో భక్తులు పరవశంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గంగమ్మ తల్లి పాదాలను తాకిన సూర్యకిరణాలు

నూనె బాండ్లిలో పడి చిన్నారి మృతి

- మరో ఘటనలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడు

డి.హీరేహాళ్ (రాయదుర్గం): సంక్రాంతి పండుగ వేళ రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు, వేడి నూనెలో పడి మరో చిన్నారి మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం ఆవులదట్లకు చెందిన నాగలక్ష్మి, నవీన్ దంపతులు ఈ నెల 11న ఇంట్లో పూరీలు చేశారు. అనంతరం నూనె బాండ్లీని కింద పెట్టి ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. అదే సమయంలో వారి మూడేళ్ల వయసున్న కుమారుడు శ్రీనివాసులు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వేడి నూనె బాండ్లీలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కుటుంబసభ్యుల వెంటనే అనంతపురానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం చిన్నారి మృతి చెందాడు.



శ్రీనివాసులు (ఫైల్)



గణేష్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో...

డి.హీరేహాళ్‌కు చెందిన నాగరాజు, దేవమ్మ దంపతుల మూడో కుమారుడు గణేష్ (22) పెయింటర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. మంగళవారం సోమలాపురంలో తిప్పేస్వామి ఇంటికి పెయింటింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గోడపై నుంచి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బళ్లారిలోని వైద్యశాలకు తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై ఎస్ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతి నిలయంలో వైభవంగా సంక్రాంతి





సత్యసాయి పల్లకీని సభా మందిరంలోకి తీసుకువస్తున్న విద్యార్థులు,

ప్రశాంతి నిలయం: సంక్రాంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో కనుల పండువగా జరిగాయి. సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనలో భాగంగా ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. బుధవారం ఉదయం యజుర్వేద మందిరం నుంచి బ్రాస్ బ్యాండ్ వాయిద్యం నడుమ సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగింపుగా సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంతకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు చక్రవర్తి, విద్యాసంస్థల వైస్ ఛాన్సలర్ ఆచార్య రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత 'అవతార వైభవం' పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది.

ఇరువర్గాల ఘర్షణ - ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన చెరుకూరి ఈశ్వరమ్మ, చెరుకూరి ఈశ్వరయ్య వర్గాల మధ్య కొంత కాలంగా ఓ బంగారు గొలుసు విషయంగా వివాదం నెలకొంది. ఈ విషయంగా ఈశ్వరయ్య మేనల్లుడు ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. తన మేనల్లుడిపై అక్రమంగా కేసు నమోదు చేయించారంటూ తరచూ ఈశ్వరమ్మ వర్గంతో ఈశ్వరయ్య వర్గీయులు గొడవ పడేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇరు వర్గాల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకోవడంతో ఈశ్వరమ్మ, హేమంత్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, ప్రవీణ్, గవ్వల శివయ్య, గవ్వల ఈశ్వరమ్మ గాయపడ్డారు. ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు చియ్యేడుకు చెందిన హేమంత్, నాగార్జున, రామాంజనేయులు, అనంతసాగరానికి చెందిన శివయ్య, ఆదెప్పతో పాటు మరో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు గవ్వల ప్రవీణ్, శివయ్య, ఈశ్వర్యతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహాసమాధిని సందర్శించిన ఎల్‌బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్



శ్రీరామ్ తనకంటికు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో ఉన్న పబ్లిక్ పాలసీ-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌పై సివిల్ సర్వీసెస్ శిక్షణా సంస్థ (లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ - ఎల్‌బీఎస్ఎన్ఏఏ) డైరెక్టర్ శ్రీరామ్ తనకంటి మంగళవారం ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. ఈ సరందర్భంగా ఆయనకు శాంతి భవన్ అతిథి గృహం వద్ద ఆ జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ వి.రత్న, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ... పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

చిరుత దాడిలో మేక మృతి



మృతి చెందిన మేక

గుడిబండ: చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన గుడిబండ మండలం గుణేమోరబాగల్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... గుణేమోరబాగల్‌కు చెందిన హనుమక్క... జీవాల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జీవాలను తన పొలం వద్ద దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఓ మేక మృతి చెంది కనిపించింది. మెడపై చిరుత పంటి గాట్లను గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ సంజీవరాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారాన్ని గమనిస్తూ, దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్యప్రాణుల వల్ల నష్టం వాటిల్లితే బాధిత రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.

కోక కట్టిన తోట.. కవర్ తొడిగిన కాయ

చిన్నంపల్లిలో దానిమ్మ తోట చుట్టూ చీరలతో వేసిన కంచె





తెగుళ్లు సోకకుండా దానిమ్మ కాయలకు చుట్టిన కవర్



బీకేఎస్ వద్ద అరటి గెలలకు చుట్టిన కవర్లు

పంటల సాగులో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు రైతులు నూతన విధానాలను అవలంబిస్తున్నారు. తమకు అందుబాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన దిగుబడి సాధించేలా కార్యాచరణను చేపట్టారు. ఇందులో భాగంగా రాప్తాడు మండలం చిన్నంపల్లి వద్ద రైతు నారాయణస్వామి సాగు చేసిన దానిమ్మ పంటలో అడవి పందులు, జింకలు చొరబడకుండా చుట్టూ చీరలతో కంచె ఏర్పాటు చేశారు. కాయకు తెగుళ్ల సోకకుండా కవర్ తొడిగారు. అలాగే శింగనమల మండలం బుక్కరాయసముద్రం వద్ద రైతులు చేపట్టిన అరటి సాగులో గెలలకు కవర్ చుట్టి కాయ నాణ్యతను కాపాడేలా చర్యలు తీసుకున్నారు. ఇలా చేస్తే నాణ్యమైన దిగుబడి పక్కా అని రైతులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

క్లుప్తంగా

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతుల నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే ప్రక్రియను తక్షణమే ఆపాలన్నారు. చట్టసభలు, స్థానిక సంస్థలు, విద్య,ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఉద్యమాల్లో భాగస్వాములను చేయడం కోసం ఆర్‌పీఎస్‌లోకి యువతను తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఆర్‌పీఎస్ యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా జీబీ ఉజ్వల్‌ను నియమించినట్లు తెలిపారు.

‘అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టను అడ్డుకోవడం దారుణం’

అనంతపురం టవర్‌క్లాక్: తెనాలిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రతిష్టించకుండా అడ్డుకోవడం దారుణమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. విగ్రహ ప్రతిష్టాపనను వ్యతిరేకిస్తున్న కూటమి నాయకుల చర్యలను నిరసిస్తూ బుధవారం నగరంలో అంబేడ్కర్ విగ్రహం ముందు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ 1996లో తెనాలి పట్టణంలో ప్రపంచ మేధావి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారని, భారీ ఎత్తున నిర్మించిన విగ్రహాన్ని ఎలాగైనా తొలగించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ చూస్తుండడం దారుణమన్నారు. అంబేడ్కర్ జోలికి వస్తే ఎవరైనా మసై పోతారన్నారు. లేనిపోని ఆంక్షలు ఎందుకు పెడుతున్నారని హెచ్చరిస్తూ అన్ని ప్రజా సంఘాల వారిని కలుపుకుని ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమతా దళ్ జిల్లా సుగుమంచి శ్రీనివాసులు, జేఏసీ నాయకులు రామకృష్ణ, వెంకటేశు, బాలకుల్లాయప్ప, సురేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై లక్ష్మీచెన్నకేశవుడు

చెన్నేకొత్తపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాన్ని హనుమద్ వాహనంపై మంగళవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేశారు.

బాలిక అదృశ్యం

అనంతపురం: నగరంలోని బిందెల కాలనీకి చెందిన ఓ బాలిక ఈ నెల 11న అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. 11వ తేదీ నుంచి బుధవారం వరకు పలు చోట్ల వెతికినా బాలిక ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేలండర్ ఆవిష్కరణ




రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతపురం రూరల్ పాపంపేటలోని రెడ్డి జన సంఘం కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రొద్దం సురేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కోన వెంకట శివారెడ్డి, నందికొట్కూరు రమణారెడ్డి, ముదిగోళం దయానంద రెడ్డి, పోతిరెడ్డి, కల్లూరు నాగరత్నం రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని టీసర్కిల్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురానికి చెందిన మెడికల్ రెప్ శివ విధి నిర్వహణలో భాగంగా బుధవారం పట్టణంలోని టీసర్కిల్ వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై వెళ్తుండగా రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి శివను ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తీసుకెళ్లారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కొండపై మంగళవారం రాత్రి లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, స్వామి మాలధారులు, భక్తులు రథాన్ని లాగారు. కొండ వద్ద నుంచి పట్టణంలోని పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. జై లక్ష్మీనరసింహస్వామి అంటూ నినాదాలు చేశారు.

నేనే రాణి.. నేనే మంత్రి

గతంలో ఆమె ఇష్టారాజ్యంగా వ్యవహరించి తీవ్ర విమర్శలు మూటగట్టుకున్నారు. అనేక సార్లు పై అధికారులు అక్షింతలు వేసినా మారలేదు. దీంతో వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజాప్రతినిధుల అండదండలతో మళ్లీ యథాస్థానానికి చేరుకున్నారు. పాత పంథా వీడకుండా గతంలో మాదిరిగానే ఉన్నతాధికారులను లెక్కచేయకుండా ‘నేనే రాణి..నేనే మంత్రి’ చందాన వ్యవహరిస్తుండంపై కార్యాలయ సిబ్బందే మండిపడుతున్నారు.

- నగరపాలక సంస్థలో ఓ అధికారిణి పెత్తనం
- వర్క్ అలాట్‌మెంట్ లేకుండానే లాగిన్ సొంతం
- భవనాల అనుమతుల ఫైళ్లు తనకు పంపాలంటూ హుకుం
- బెంబేలెత్తుతున్న పట్టణ ప్రణాళిక కార్యదర్శులు



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ఆ అధికారిణికి రెక్కలొచ్చాయి. తను ఎక్కడ పోస్టింగ్ కావాలంటే అక్కడకు తెచ్చుకోవడం.. తాను చెప్పిందే జరగాలంటూ హుకుం జారీ చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇటీవల బదిలీపై నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్‌కు వచ్చిన ఆ అధికారిణికి వర్క్ అలాట్ చేయలేదు. అయినా, విజయవాడ నుంచి లాగిన్ తెచ్చుకోవడం పెద్ద చర్చనీయాంశమైంది. కమిషనర్లకే వారం రోజులకుపైగా పట్టే పనులు ఆ అధికారిణికి క్షణాల్లో జరగడంపై అంతా విస్తుపోతున్నారు.

పాలకవర్గం వద్దన్నా..

ఇటీవలి వరకూ పక్క జిల్లాలోని ఓ మునిసిపాలిటీలో విధులు నిర్వర్తించిన ఆమె అక్కడ రిలీవ్ కాకుండానే నగరపాలక సంస్థలో ప్రత్యక్షమైంది. సదరు అధికారిణిపై గతంలో విమర్శలున్నాయని, చేర్చుకోకూడదని అధికారులకు ఇక్కడి పాలకవర్గం తేల్చి చెప్పింది. కానీ స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. భవన నిర్మాణ అనుమతులు, 14 శాతం ట్యాక్స్, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్, అడ్వర్టైజ్‌మెంట్, గిఫ్ట్ డీడీల విషయంలో సదరు అధికారిణిపై పెద్ద ఎత్తున విమర్శలుండడంతో గత కమిషనర్ సైతం క్షేత్రస్థాయికి వెళ్లవద్దని, ఆఫీసు కార్యాలయంలోనే ఉండాలని స్పష్టం చేశారు. కానీ టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ కీలక అధికారిణి.. సిబ్బంది కొరతను చూపుతూ వర్క్ అలాట్‌మెంట్ లేకుండానే లాగిన్ ఇచ్చేందుకు పరోక్షంగా సహకరించడం గమనార్హం.

‘అన్ని ఫైళ్లు నాకే..’

భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ప్రతి ఫైల్‌ను తనకే పంపాలంటూ సదరు టౌన్ ప్లానింగ్ అధికారిణి పట్టణ ప్రణాళిక కార్యదర్శులకు చెప్పడం చర్చనీయాంశమైంది. వర్క్ అలాట్‌మెంట్ కాకుండానే ఏవిధంగా ఫైళ్లను పంపాలని, ముందు ఏవైనా నిర్మాణ అనుమతుల్లో తేడాలొస్తే తమ ఉద్యోగం మీదకు వస్తుందని పట్టణ ప్రణాళిక కార్యదర్శులు లబోదిబోమంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన సమయంలో ఐదుగురు పట్టణ ప్రణాళిక కార్యదర్శులతో ఆమె కోటరీ ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడిన సందర్భాలు లేకపోలేదు. భవన నిర్మాణ అనుమతులకు వచ్చే డబ్బులు పంచుకునేందుకు ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. నేడు నగరపాలక సంస్థ కమిషనర్, ఏసీపీ లేకపోవడంతో యథేచ్ఛగా అనధికార నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు అడ్డదారుల్లో ఆమె వెళ్తున్నట్లు నగరపాలక సంస్థలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరి ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

శోభన్‌బాబుకు స్వర నీరాజనం



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

అనంతపురం కల్చరల్: అలనాటి నటుడు శోభన్ బాబు 89వ జయంతి వేడుకలు ఆనందోత్సాహాల నడుమ సాగాయి. స్థానిక కృష్ణకళామందిరం శోభన్ బాబు పాటలతో, ఆయన నటించిన సన్నివేశాలకు తగిన విధంగా ఆడిపాడిన కళాకారులతో హోరెత్తింది. గాయనీ గాయకులు ఆయనకు మధురగీతాలతో, కళాకారులు డ్యాన్సులతో నీరాజనాలర్పించారు. కేక్ కట్ చేసి ఆనందాలను పంచుకున్నారు. ముఖ్యంగా భారీ ఎల్‌ఈడీపై ప్రదర్శించిన సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయ కళాసమితి బాలమురళి, రామాంజలి మాట్లాడుతూ శోభన్‌బాబు చిత్రమాలిక విశేషాలను అభిమానులతో పంచుకున్నారు. చంద్రమౌళి, నంజుండప్ప, విజయలక్ష్మి, శ్రీదేవి, నంజుడప్ప తదితరులు ఆలపించిన మధుర గీతాలు మంత్రముగ్ధులను చేశాయి. శోభన్‌బాబు సేవా సమితి సభ్యులు భూపన్న, రఫీ, వెంకటరామిరెడ్డి, గౌస్‌పీరా, శ్రీనివాసులు, రోషన్, సిరాజ్, అమరనాథ్, రాజేంద్ర, కృష్ణమూర్తి, రవిరాజు, వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘సజ్జ మొలక ఉత్సవాలు’



పెద్ద విఠోబ దేవాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ దేవాలయంలో మంగళవారం సాయంత్రం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో సజ్జ మొలక ఉత్సవాలు నిర్వహించారు. రుక్మిణీ పాండురంగ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. తరతరాల భారతీయ సంస్కృతికీ ప్రతీకగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. కొత్త సజ్జల మొలకలు, కొత్త బెల్లం ముక్కలు, వేరుశెనగ పప్పు, జీడీ పప్పు, సోపు ఇలా రకరకాల దినుసులు కలిపి కలుదైవం రుక్మిణీ పాండురంగస్వామికి నివేదన చేస్తారు. అనంతరం వాటిని భక్తులకు అందిస్తారు. స్వామికి అర్చకులు విశేష పూజలు చేసిన అనంతరం మొలకలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆఫిర్కా సభ్యులు, శ్రీనివాసరావు, జీ రాజశేఖర్‌రావు, అడ్వకేట్ దత్తు, ముకుందా, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



గౌరి ప్రసన్నేశ్వరస్వామి ఆలయం దగ్గర ముగ్గులు వేస్తున్న మహిళలు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని గౌరి ప్రసన్నేశ్వరస్వామి ఆలయం దగ్గర మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గౌరి ప్రసన్నేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రెనాటి కొండారెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహానందిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో దాదాపుగా 250 మంది మహిళలు పాల్గొన్నారు. సర్పంచు ఉప్పర శశికళ, మాజీ సర్పంచులు భూమిరెడ్డి సావిత్రి, ఉప్పర నారాయణమ్మ ఆకర్షణీయమైన ముగ్గులను ఎంపిక చేసి విజేతలను నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి పరంధామ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు విజయ్ కుమార్ రెడ్డి, సుంకి రెడ్డి, ఉప్పర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల ఆగడాలు అరికట్టాలి



రామచంద్ర

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో హిజ్రాల ఆగడాలతో యువత పెడదారి పడుతోందని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర వాపోయారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులు ఎక్కువగా బస్టాండ్ సమీప ప్రాంతాల్లో హాస్టల్స్, అద్దె రూములు తీసుకొని చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో జూనియర్ కళాశాలలు, స్కూళ్లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సాయంత్రం చీకటి పడిందంటే ఈ ప్రాంతం రెడ్ లైట్ ఏరియాను తలపిస్తోందన్నారు. రాత్రి 10 గంటల వరకు కియా బస్సులు వెళ్తుంటాయన్నారు. అటుగా వెళ్తున్న విద్యార్థులు, యువత పట్ల హిజ్రాలు వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభం శుభం తెలియని గ్రామీణ పేద విద్యార్థులు వీరి బారిన పడి తమ జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్నారని వాపోయారు. ముఖాలకు తెల్లని రంగు అద్దుకొని, ధగ ధగ మెరిసే దుస్తులతో విటులకు గాలం వేస్తున్నారన్నారు. 15 ఏళ్లలోపు పిల్లలు ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతంగా సెల్ ఫోన్లు లాక్కోవడం, డబ్బులు, ఉంగరాలు, మెడలో గొలుసులు అపహరించి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. హిజ్రాల తతంగం బహిరంగంగానే జరుగుతున్నా పోలీసులు కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. కౌమార దశలో ఉన్న పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పోలీసులు జోక్యం చేసుకుని హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వనవాసం వీడి నివాసాల్లోకి..



గ్రామ దేవతలతో ఊరేగింపుగా వస్తున్న ప్రజలు



గ్రామ పొలిమేర నుంచి పిల్లా పాపలతో ఊర్లోకి వస్తున్న స్థానికులు

కుందుర్పి: గ్రామ శాంతి కోసం సోమవారం సాయంత్రం 4 గంటలకు ఊరొదిలిన శ్రీమజ్జనపల్లి గ్రామస్తులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు దేవుళ్లతో సహా ఇళ్లలోకి చేరుకున్నారు. ఐదేళ్లకోసారి ఇలా గ్రామం నలుమూలలా ముళ్లకంచె వేసి మూగజీవాలు, పిల్లాపాపలతో సహా 24 గంటలకు సరిపడా ఆహారంతో ఊరొదలడం వందేళ్ల కాలంగా జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పొలిమేరలో వంటావార్పుతో రాత్రికి అక్కడే నిద్రించి మంగళవారం ఆరుబయటే స్నానాలు ఆచరించిన పిదప గ్రామం చుట్టూ ఉన్న కంచెను తొలగించి ఇళ్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతలను ఊరేగించారు.

నగరం.. నిశ్శబ్దం



నిర్మానుష్యంగా టవర్‌క్లాక్- సప్తగిరి సర్కిల్ మార్గం



ప్రయాణికులు లేక కళ తప్పిన ఆర్టీసీ బస్టాండ్

సంక్రాంతికి సందడిగా ఉండాల్సిన నగరం మూగబోయింది. జనం పల్లెల బాట పట్టడంతో వాహనదారులు లేక రోడ్లన్నీ బోసిపోయాయి.వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎప్పుడూ సందడిగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులు లేక కళతప్పింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రభుత్వ సర్వజనాస్పత్రి రోడ్డు ఇలా..



బోసిపోయిన టవర్‌క్లాక్ బ్రిడ్జ్

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి

- ప్రత్యేక పూజలందుకున్న అమ్మవార్లు
- భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు



చెన్నేకొత్తపల్లి: అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి మూలవిరాట్

సాక్షిబృందం: రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేశారు. వీధులన్నీ రంగు రంగుల రంగవల్లులతో కళకళలాడాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలన్ని భక్తులతో కిక్కిరిశాయి. ఆయా గ్రామాల్లో బుధవారం కనుమ పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు, కుర్చీలాట, గాలిపటాలు ఎగుర వేయడం తదితర పోటీలు నిర్వహించారు. అలాగే యువకులు చీనీ కాయలు, నిమ్మకాయలు, టెంకాయలు విసరడం లాంటి పందేలు ఆడారు.

భక్తిశ్రద్ధలతో ...

అనంతపురం కల్చరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయాలలో భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో భక్తులతోనే ప్రత్యేక పూజలు చేయించారు. ప్రసాద వితరణలో అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పలు అయ్యప్ప స్వామి ఆలయాలు స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. శబరిమలలో సాగే మకరజ్యోతి దర్శనం సందర్భంగా అనంతలో ప్రత్యేక పూజలు జరిగాయి.

- తపోవనంలోని శివశక్తిసాయిబాబా మందిరంలో బుధవారం రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నగర సంకీర్తన, అనంతరం నగరవీధుల్లో రథోత్సవం సాగుతున్నప్పుడు భక్తులు బారులు తీరి సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేంకటేశ్వరస్వామి, శివపార్వతులు, షిరిడీ సాయిబాబా ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, అలంకార సేవలు జరిగాయి. నెలరోజులుగా తెల్లవారుజామున నగర సంకీర్తన చేసిన భక్త బృందాలకు సాయిట్రస్టు విజయ్‌కుమార్, భజన బృందం నాగేశ్వరరావు తదితరులు బహుమతులనందించారు. మధ్యాహ్నం నాయరాయణ సేవ, తీర్థప్రసాద వితరణ జరిగింది. రథోత్సవంలో బ్రహ్మానందరెడ్డి, నాగరాజు మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ



రాప్తాడులో శివాలయం వీధిలో పోతులయ్య (బొడ్రాయి) స్వామికి వేసిన అందమైన ముగ్గు



అనంతపురం కల్చరల్ : బాలయోగి ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



రాప్తాడు: అలంకరణలో పెద్దమ్మ దేవత

ఉత్సాహంగా సంబరాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈనెల 12 నుంచి గురువారం వరకూ వివిధ క్రీడలు నిర్వహించారు. వరుసగా నాల్గో ఏట నిర్వహించిన ఈ పోటీలు గ్రామంలో ఐక్యతను చాటిచెప్పాయి. పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున క్రీడల్లో భాగస్వాములయ్యారు. గ్రామ పెద్దల సహకారంతో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బాట్మింటన్ పోటీలు నిర్వహించారు. క్రీడల్లో పాల్గొనే యువతకు భోజన వసతి కల్పించారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అందజేసిన బహుమతులతో గ్రామపెద్దలు